క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ ప్రభంజనం ఖాయం



పోడూరు మండల కార్యకర్తలతో సమీక్ష నిర్వహిస్తున్న శ్రీరంగనాథరాజు, షర్మిలారెడ్డి

పెనుగొండ: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభంజనం ఖాయమని, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రెండోసారి బాధ్యతలు చేపడతారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు స్పష్టం చేశారు. బుధవారం తూర్పుపాలెంలోని కార్యాలయంలో ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ మేడపాటి షర్మిలా రెడ్డితో కలసి పోడూరు మండల కార్యకర్తలు, నాయకులు, ప్రజా ప్రతినిధులుతో కలసి సమీక్ష నిర్వహించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కుల మత, వర్గాలు, పార్టీల కతీతంగా సంక్షేమాన్ని అందించామన్నారు. ప్రతి కుటుంబానికీ మంచి చేశామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబానికీ సంక్షేమం అందించడంతో సీఎం జగన్ ధైర్యంగా మంచి జరిగితేనే ఓటు వేయండంటూ అడుగుతున్నారన్నారు. ప్రతి పక్ష నాయకులు మమ్మల్ని గెలిపించడంటూ ప్రాధేయపడుతున్నా ప్రజలు పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో పోడూరు ఎంపీపీ సబ్బితి సుమంగళి, జెడ్పీటీసీ సభ్యుడు గుంటూరి పెద్దిరాజు, పార్టీ మండల కన్వీనరు పిల్లి నాగన్న, ఏపీ సీడ్స్ కార్పొరేషన్‌డైరెక్టరు పోతుమూడి రామచంద్రరావు, చేకూరి సూరిబాబు, రుద్రరాజు శివాజీరాజు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

మొగల్తూరు: రాబోయే రోజుల్లో ధాన్యం కొనుగోలుపై రైతులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేసుకోవాలని వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్ ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో వీఆర్వోలు, ఆర్‌బీకే సిబ్బందితో ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు.ఈ-క్రాప్‌లో నమోదైన వివరాల మేరకు ఆర్‌బీకే సిబ్బంది నేరుగా రైతుల వద్దకు వెళ్లి ధాన్యాన్ని పరిశీలించి కొనుగోలు చేయాలన్నారు. ధాన్యం కొనుగోలుకు అవసరమైన గోనె సంచులు అందుబాటులో ఉంచామన్నారు. జీపీఎస్ సిస్టం అమర్చిన లారీ, ట్రాక్టర్, ఆటోలు మాత్రమే వినియోగించాలని సూచించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ భాస్కర్, డీటీ సూర్య నారాయణ రాజు, ఎంపీడీఓ వి.బాబ్జిరాజు పాల్గొన్నారు.

చంద్రబాబు కుట్రలు మానుకోవాలి

పెనుగొండ: ప్రభుత్వ సంక్షేమ పథకాలను పారదర్శకంగా సకాలంలో లబ్ధిదారులకు అందిస్తున్న వలంటీర్లపై చంద్రబాబు చేస్తున్న కుట్రలను మానుకోవాలని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ మండల కన్వీనరు కాసాని శ్రీనివాసు హితవు పలికారు. బుధవారం వడలిలో మాట్లాడుతూ ఆది నుంచి వలంటీర్లపై చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు అక్కసు వెళ్లగక్కుతున్నారని విమర్శించారు. వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు అండగా నిలుస్తున్న వలంటీర్లపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసి వారికి అన్యాయం చేసిన ఘనుడు చంద్రబాబు అని విమర్శించారు.

క్రైస్తవ సమాజానికి సీఎం జగన్‌తోనే మేలు

పాలకొల్లు అర్బన్: క్రైస్తవ సమాజానికి ఎంతో మేలు చేసిన సీఎం జగన్‌తో పాటు పాస్టర్ల నిత్య ప్రార్థనలో తన విజయానికి ప్రార్థించాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) కోరారు. పాలకొల్లు మండలం శివదేవునిచిక్కాలలో పాస్టర్ బి.ఇశ్రాయేలు చర్చి ఆవరణలో బుధవారం జరిగిన ది పాలకొల్లు పట్టణ, మండల పాస్టర్ల ప్రత్యేక సమావేశంలో గుడాల గోపి పాల్గొని ప్రత్యేకంగా ప్రార్థన చేయించుకున్నారు. పాలకొల్లులో క్రైస్తవుల సమస్యలు తనకు పూర్తిగా అవగాహన ఉందన్నారు. ముందుగా పాస్టర్ల సమావేశంలో పలు తీర్మానాలు చేసుకున్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, సంఘ గౌరవాధ్యక్షుడు ఐ సెయింట్‌పాల్, అధ్యక్షుడు జీవైకే శ్యాంసన్, కన్వీనర్ మట్టా జాన్‌మోషే, ఉపాధ్యక్షులు కుసుమే రాజు, జి.రాజారత్నం, కోశాధికారి ఎస్.కిషోర్ పాల్గొన్నారు.

పింఛన్ల కోసం పడిగాపులు

- మళ్లీ పాత రోజులు వచ్చాయని ఆవేదన
- మండుటెండల్లో సచివాలయాల వద్దకు క్యూ



యలమంచిలి: అడవిపాలెం సచివాలయం వద్ద రాత్రి సమయంలో లైట్‌ల వెలుగులో పింఛన్‌ల కోసం వేచి ఉన్న వృద్ధ మహిళలు



పెనుమంత్ర: పంచాయతీలో క్యూలో నిలుచుని పెన్షన్‌లు అందుకుంటున్న లబ్ధిదారులు



పెనుగొండ: తూర్పుపాలెంలో పింఛన్ కోసం మండుటెండలో వస్తున్న వృద్ధురాలు

యలమంచిలి: పింఛన్‌ల పంపిణీ మొదటిరోజునే లబ్ధిదారులంతా సచివాలయాల వద్ద పింఛన్‌లు కోసం పడిగాపులు పడ్డారు. గడచిన ఐదేళ్లుగా కోడి కూయక ముందే ఇంటి వద్దనే వలంటీర్స్ ద్వారా పింఛన్‌లు అందుకున్న లబ్ధిదారులకు మళ్లీ సచివాలయాలకు వెళ్లి అక్కడ పింఛన్ కోసం ఎదురుచూడడం ఇబ్బందికి గురి చేసింది. యలమంచిలి మండలంలోని 32 గ్రామాలలో 10,541 పింఛన్స్లు ఉండగా మొదటి రోజు సచివాలయ సిబ్బంది 2900 పింఛన్స్లు పంపిణీ చేశారు. గతంలో వలంటీర్స్ ద్వారా పింఛన్‌లు పంపిణీ చేసిన పుడు మొదటి రోజునే 95 శాతం పైబడి పింఛన్‌లు పంపిణీ జరిగేది. పింఛన్‌ల పంపిణీ సమయంలో సచివాలయాల వద్ద టెంట్‌లు వేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేసినా, ఎండల్లో వృద్ధులు సచివాలయానికి వచ్చేసరికి వేడి తట్టుకోలేక అల్లాడారు. కొన్ని గ్రామాల్లో చీకటి పడిన తరువాత కూడా పింఛన్‌ల పంపిణీ కొనసాగింది. దీంతో విద్యుత్ వెలుగులో దోమల మధ్య పింఛన్ తీసుకోవడం వృద్ధులకు కష్టాన్ని కలిగించింది. తెలుగుదేశం కూటమి నాయకుల వలన ఏర్పడిన ఈ దుస్థితికి లబ్ధిదారులంతా ఆవేదన వ్యక్తం చేశారు.

పాలకొల్లులో..

పాలకొల్లు అర్బన్: ప్రతి నెలా 1నే వేకువజామున వలంటీర్ల చేతుల మీదుగా పింఛన్ పొందే వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు చంద్రబాబు నిర్వాకం వల్ల మూడు రోజులు ఆలస్యమైంది. బుధవారం మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల వద్ద పింఛన్ లబ్ధిదారులతో కోలాహలంగా మారింది. అధికారులు టెంట్‌లు, మంచినీరు ఏర్పాటు చేశారు. అయితే కొన్ని పంచాయతీల్లో సర్వర్ కారణంగా ఆలస్యమైంది. ఈ నెల 6 వరకు ఆయా సచివాలయాల వద్ద పింఛన్లు అందజేస్తామని ఎంపీడీఓ అనుపమ తెలిపారు. పాలకొల్లు మండలంలో మొత్తం 9309 మంది లబ్ధిదారులకు రూ.2,73,81,500 పంపిణీకి నగదు సిద్ధం చేశారు. బుధవారం 60 శాతం మంది అంటే 5,586 మంది వృద్ధులకు పింఛన్లు పంపిణీ పూర్తి చేశారు.

పెనుమంత్రలో..

పెనుమంత్ర: మండలంలో వివిధ గ్రామాలలో బుధవారం పింఛన్‌దారులు గ్రామ పంచాయతీ కార్యాలయానికి వెళ్లి పింఛన్ సొమ్ము తీసుకునేందుకు సాయంత్రం వరకు ఎదురు చూసి వెనుదిరిగి వెళ్లారు. కొన్ని గ్రామ పంచాయతీలలో సాయంత్రం 4 గంటల నుంచి పింఛన్‌ల పంపిణీకి అధికారులు ప్రారంభించి 7 గంటలకు కౌంటర్ మూసివేయడంతో అనేక మంది వెనుదిరిగి వెళ్లారు. పెనుమంత్ర మండలం పెనుమంత్రలో 736 మందికి పింఛన్‌లు ఇవ్వాల్సి ఉండగా 145 మందికి, నెగ్గిపూడిలో 593 మందికి 191 మందికి, నత్తారామేశ్వరంలో 523 మందికి పింఛన్ ఇవ్వాల్సి ఉండగా కేవలం నలుగురికి మాత్రమే పింఛన్‌లు అందజేసినట్లు సమాచారం.

నరసాపురం మండలంలో..

నరసాపురం రూరల్: మండలంలోని అన్ని సచివాలయాల వద్ద పింఛన్ల పంపిణీకి సంబంధించి టెంట్లు, తాగునీటి, వైద్యసదుపాయం సమకూర్చామని అధికారలు తెలిపారు. మండలంలో 11,527 మందికి పింఛన్‌లు ఇవ్వాల్సి ఉండగా బుధవారం 3700 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

నరసాపురం పట్టణంలో పంపిణీకు చర్యలు

నరసాపురం: నరసాపురం పట్టణంలో ఫింఛన్ల పంపిణీకి అధికారులు చర్యలు చేపట్టారు. పట్టణంలోని మొత్తం 15 సచివాలయాల్లో 5806 మందికి రూ 1,74,63,500లు పంపిణీ చేయాలని మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వర రావు బుధవారం సచివాలయ సిబ్బందికి సూచించారు. పింఛన్‌ల పంపిణీకి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టామని విలేకరుల వద్ద స్పష్టం చేశారు. పట్టణంలోని అన్ని సచివాలయాల వద్ద టెంట్లు వేసి మంచినీటి వసతి ఏర్పాటు చేసినట్టు చెప్పారు.



పాలకొల్లు అర్బన్: పూలపల్లిలో పింఛన్లు తీసుకోవడానికి క్యూలో నిలబడిన వృద్ధులు



పాలకొల్లు అర్బన్: లంకలకోడేరులో వృద్ధుడికి పింఛన్ నగదు అందజేస్తున్న దృశ్యం



పెనుమంత్ర: పింఛన్ సొమ్ము కోసం చీకటిలో వేచి ఉన్న పింఛన్‌దారులు

సంక్షేమ పాలనకు పట్టం కట్టాలి



ఎల్బీచర్లలో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కరపత్రం అందజేస్తున్న చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: ప్రజలకు సంక్షేమ పాలనను అందిస్తున్న వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, స్థానిక ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు ఓటర్లను విజ్ఞప్తి చేశారు. నరసాపురం మండలంలోని ఎల్బీచర్ల గ్రామంలో బుధవారం వేకువజాము నుంచి ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్నే మనకు మరోసారి ముఖ్యమంత్రి కావాలని, సంక్షేమం అభివృద్ధి జగనన్నతోనే సాధ్యమని అన్నారు. విద్య, వైద్య రంగాల్లో సీఎం జగన్‌విప్లవాత్మక మార్పులు తీసుకు వచ్చారని, ప్రతి ఓటరూ ఫ్యాన్ గుర్తుపై ఎంపీ, ఎమ్మెల్యేలకు రెండు ఓట్లు వేయాలని అన్నారు. నియోజకవర్గంలో తాను చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ప్రజలు మరో సారి అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ ఐదేళ్ల కాలంలో గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతోపాటు ప్రతి గ్రామంలో సంక్షేమంతోపాటు అభివృద్ధికి కూడా కృషి చేశామన్నారు. ఎల్బీచర్ల గ్రామంలో తండ్రి ముదునూరి ప్రసాదరాజుకు ఓ వైపు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తుండగా నాన్నను గెలిపించాలంటూ ప్రసాదరాజు తనయుడు ముదునూరి శ్రీకృష్ణంరాజు అదే గ్రామంలోని చిల్లపాలెం, బైనపాలెం తదితర ప్రాంతాల్లో ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ తిరుమాని నాగరాజు, జెడ్పీటీసీ సభ్యులు బొక్కా రాధాకృష్ణ, బాపూజీ, వేములదీవి సర్పంచ్ యమునా భానుమూర్తి, ఎంపీటీసీ సభ్యులు సంగాని భవానీ, కోఆప్షన్ సభ్యుడు మెంటు మస్తాన్, బర్రి శ్రీవెంకటరమణ, అంద్రాజు చల్లారావు, బర్రి జయరాజు, దొంగ మురళీకృష్ణ బొడ్డు ఆశిష్ కుమార్, సంగాని లక్ష్మణస్వామి, కంచర్ల రామకృష్ణ, సంగాని వడ్డికాసులు, రాట్నాల రాము తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు వల్లే వృద్ధుల అవస్థలు తీవ్రం



వెంకట్రామపురంలో శ్రీరంగనాథరాజుకు మహిళల నీరాజనం

పెనుగొండ: చంద్రబాబు చేసిన ఘనకార్యం వల్లే అవ్వాతాతలు నేడు అవస్థలు పడాల్సి వస్తుందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు విమర్శించారు. బుధవారం పెనుగొండ మండలం వెంకట్రామ పురం, పెనుగొండలోని మల్లప్ప దిబ్బ, చిన్నంవారిపాలెంలో ఎన్నికల శంఖారావంలో భాగంగా పాదయాత్ర నిర్వహించి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రామపురం ప్రధాన రహదారి నిర్మాణం చేసినందుకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. నాడు నేడుతో వెంకట్రామపురంలో పాఠశాల రూపురేఖలు మార్చారంటూ కితాబునిచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆది నుంచి వలంటీరు వ్యవస్థపై కక్ష గట్టుకొని ఉండడంతో ఎన్నికల నేపథ్యంలో ముందుగానే వలంటీర్లను అడ్డుతప్పించే పన్నాగంలో భాగంగా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారని వివరించారు. దీంతో అవ్వాతాతలకు, వికలాంగులకు పింఛన్ అందించలేని పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. మండు వేసవి ఎండలతో సచివాలయంకు వచ్చి పింఛన్ తీసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. కుట్రలు పన్నే చంద్రబాబుకు ప్రజలు బుద్ధి చెప్పాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. సంక్షేమం ఇంటి వద్దకే నేరుగా రావడానికి సీఎం జగన్‌కు మద్దతు పలకాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేసి మరోసారి విజయాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యుడు పోడూరి గోవర్ధన. మండల కన్వీనరు నలిమిల్లి బాబి రెడ్డి, వెంకట్రామపురం సర్పంచ్ పిల్లి అనంతలక్ష్మి నాగన్న, ఎంపీటీసీ సభ్యురాలు పెచ్చెట్టి లలిత, మద్దింశెట్టి లలిత, పంచాయతీ సభ్యుడు అయినవల్లి పద్మావతి, సచివాలయం కన్వీనరు సిర్రా దేవిక, మండల ఎస్సీ సెల్‌కన్వీనరు పలివెల శ్రీను, జిల్లా యువజన కార్యదర్శి జెంట్రీ శ్రీను, గంగోలు మురళీ పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనకు ప్రజలు నీరాజనాలు



బద్దావానిపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)



గుడాల గోపికి ఓటు వేయాలని పాలకొల్లు లజపతిరాయపేటలో మహిళలకు బొట్టుపెట్టి ఓటు అభ్యర్థిస్తున్న గోపి భార్య మంగతాయారు

పాలకొల్లు అర్బన్: సీఎం జగన్ పాలనకు ప్రజలు నీరాజనాలు పడుతున్నారని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) స్పష్టం చేశారు. పాలకొల్లు పట్టణంలోని 27వ వార్డు లజపతిరాయపేట, బద్దావానిపేట,చాంబర్స్ కళాశాల ప్రాంతాల్లో బుధవారం గుడాల గోపి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతిగడపలోనూ లబ్ధిదారులు సంక్షేమ పథకాలు పొందారని చెప్పారు. ఓటర్లే స్వయంగా వారు పొందిన లబ్ధిని వివరిస్తూ సీఎం జగన్‌కే ఓటు వేస్తామని చెబుతున్నారని గోపి వివరించారు. సీఎం జగన్ పాలనపై ప్రతీ ఒక్కరికీ నమ్మకం కలిగిందన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలకు మరింత మేలు చేసే విధంగా మ్యానిఫెస్టోని సీఎం జగన్ సిద్ధం చేస్తున్నారన్నారు. ప్రతిపక్ష పార్టీలకు డిపాజిట్‌లు కూడా దక్కవన్నారు.

పింఛన్ల కోసం అవ్వాతాలు సచివాలయాల వద్ద పడిగాపులు

అవ్వాతాతలకు అందించే పింఛన్లను కూడా చంద్రబాబు అడ్డుకుని వారికి ద్రోహం చేశారన్నారు. సచివాలయాల వద్ద పింఛన్ కోసం పడిగాపులు కాస్తున్నారని, చంద్రబాబుకి బుద్ధిచె బుతారన్నారు. అవ్వాతాతలు మూడు నెలల పాటు పింఛన్లు తీసుకోవడానికి సచివాలయాల వద్దకు వెళ్లాలని కోరారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే పింఛన్లను వలంటీర్లు ఇంటికి తీసుకువచ్చి ఇస్తారన్నారు. కార్యక్రమంలో టీటీడీ పాలక మండలి సభ్యులు మేకా శేషుబాబు, పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు, వార్డు ఇన్‌చార్జ్ ఉప్పె పండుబాబు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చిలువూరి కుమారదత్తాత్రేయవర్మ, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్‌బాబు, పార్టీ సీనియర్ నాయకుడు అడబాల వెంకటరమణ,ఏఎంసీ మాజీ చైర్మన్ సాలా నరసయ్య, పట్టణ సచివాలయ కన్వీనర్ మోర్త గిరీష్, వార్డు నాయకులు పాలపర్తి కృపానాథ్, బద్ధా అంతర్వేది, నీలంశెట్టి సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నేరేడుమిల్లిలో గుడాల గోపి ప్రచారం

యలమంచిలి: పాలకొల్లు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) గురువారం మధ్యాహ్నం నుంచి మండలంలోని నేరేడుమిల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని పార్టీ మండల కన్వీనర్ పాత్తూరి బుచ్చిరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ శ్రేణులంతా పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

ఆగని వలంటీర్ల రాజీనామాలు



తూర్పుపాలెంలో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజును కలసి పార్టీకి అండగా ఉంటామంటున్న మార్టేరు వలంటీర్లు



పోడూరు: కవిటంలో సచివాలయ కార్యదర్శి జి.సత్యనారాయణరెడ్డికి రాజీనామా పత్రాన్ని అందజేస్తున్న గ్రామ వలంటీర్లు

పెనుగొండ: రాజీనామాల అనంతరం నియోజకవర్గంలో పలు గ్రామాల నుంచి వలంటీర్లు మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు కార్యాలయానికి వచ్చి సంఘీభావం తెలిపి అండగా ఉంటామంటూ ప్రతిజ్ఞ చేశారు. బుధవారం తూర్పుపాలెం వచ్చిన వలంటీర్లు పారదర్శకంగా సేవలందిస్తున్న తమను కించ పరిచేవిధంగా వ్యాఖ్యానించిన వారికి తగిన బుద్దిచెబుతామంటూ హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ మేడపాటి షర్మిలా రెడ్డి, పోడూరు, పెనుమంత్ర జెడ్పీటీసీ సభ్యులు గుంటూరి పెద్దిరాజు, కర్రి గౌరీ సుభాషిణీ, కర్రి వేణుబాబు, ఏపీ సీడ్స్ కార్పొరేషన్ డైరెక్టరు పోతుమూడి రామచంద్రరావు పాల్గొన్నారు.

పోడూరులో రాజీనామాల పరంపర

పోడూరు: మండలంలో కవిటం, జగన్నాథపురం, తూర్పుపాలెం గ్రామాలకు చెందిన 49 గ్రామ వలంటీర్లు బుధవారం స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాలను ఆయా సచివాలయ కార్యదర్శులకు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ వలంటీర్లు విలేకర్లతో మాట్లాడుతూ అవ్వతాతలకు, వికలాంగులకు, వితంతువులకు పింఛన్లు అందించకుండా ఎన్నికల కోడ్‌ను సాకుగా చూపి తమను అడ్డుకోవడం ఎంతో మనస్తాపం కలిగించిందనీ, నిస్వార్థంగా, పారదర్శకంగా ప్రజలకు సేవలందిస్తున్న తమను ప్రజలకు సేవచేయకుండా అడ్డుకునే పరిస్థితి వల్ల మనస్తాపంతో రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. కవిటం గ్రామానికి చెందిన 31మంది వలంటీర్లు సచివాలయ కార్యదర్శి జి.సత్యనారాయణరెడ్డికి, జగన్నాథపురం గ్రామానికి చెందిన 9మంది వలంటీర్లు సచివాలయ కార్యదర్శి ఎస్.సుధారాణికి, తూర్పుపాలెం గ్రామానికి చెందిన 9 మంది వలంటీర్లు సచివాలయ కార్యదర్శి గౌతమ్‌శ్రీనివాస్‌కు రాజీనామా పత్రాలను అందజేశారు.

పెనుమంత్రలో..

పెనుమంత్ర: ప్రజలకు సేవ చేస్తున్నతమపట్ల ప్రతిపక్షపార్టీలు వారు అనుచిత వ్యాఖ్యలు చేయడంపట్ల మనస్థాపం చెంది వలంటీర్ ఉద్యోగాలకు స్వచ్ఛందంగా రాజీనామా చేసినట్లు పెనుమంత్ర మండలానికి చెందిన పలు గ్రామాల వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను ఆయా గ్రామ కార్యదర్శులకు సమర్పించారు. ఆలమూరులో 18 మంది, పెనుమంత్రలో 27 మంది, మార్టేరులో 30 మంది, ఓడూరులో ఏడుగురు తమ ఉద్యోగాలకు రాజీనామా చేశారు.

యలమంచిలిలో..

యలమంచిలి: నాలుగున్నరేళ్లుగా వలంటీర్స్‌గా పనిచేసి మా క్లస్టర్ పరిధిలోని ప్రతి ఇంటికీ సేవలను అందించామని, అయితే ఎన్నికల కోడ్ నేపథ్యంలో పింఛన్ పంపిణీకు దూరం చేశారని కాజ పడమర వలంటీర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా తాము చుట్టుపక్కల వాళ్లతో మాట్లాడినా ప్రచారం చేస్తున్నామంటూ నిందలు వేస్తున్నారని వాపోయారు. ఈ నేపథ్యంలో బుధవారం కాజపడమర గ్రామానికి చెందిన ఎనిమిది మంది వలంటీర్లు ఇన్‌చార్జి గ్రామ కార్యదర్శి రెల్ల కేశవకు రాజీనామా పత్రాలు అందజేశారు.